## క్లుప్తంగా

### పేర్నాటిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న నేతలు

కుప్పం రూరల్: పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అందరివాడని కుప్పం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మురుగేష్ అన్నారు. ఆదివారం కుప్పం మండలం, ఉర్లవోబనపల్లిలో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సింగిల్ విండో చైర్మన్ తిమ్మోజీగౌడు, సర్పంచ్ అబ్బు, జీవీ రమేష్, జయప్రకాష్ పాల్గొన్నారు.

### పాఠశాలకు బెంచీల వితరణ



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం ప్రాథమిక పాఠశాలకు మైక్రోవాటర్‌షెడ్ తరపున 9 బెంచీలు వితరణ చేశారు. ఎంఈఓ సిద్దరామయ్య చేతుల మీదుగా వీటిని అందజేశారు. వాటర్‌షెడ్ జేఈ తేజస్విని, టీఓ షబ్బీర్ బాషా పాల్గొన్నారు.

### భగవద్గీత పఠనంతో మోక్షం



ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

కుప్పంరూరల్: భగవద్గీత పఠనంతోనే మోక్షం సాధ్యమని ప్రబోధానంద సేవా సమితి ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం కుప్పం పట్టణం హెచ్‌పీ రోడ్డులో ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ప్రచారం నిర్వహించారు. నాగరాజు, మంజునాథ్, శరవణ, కృష్ణ, శివ, చరణ్, ఇందిర, జలజాక్షి, వెంకటలక్ష్మి, యశస్విని పాల్గొన్నారు.

### 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట మహాత్మా జ్యోతిభాపూలే బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరం 5వ తరగతి లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జోత్స్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు httpr://mjpbcwreis.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈబీసీ, బీసీలకు 11 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలకు 13 ఏళ్లు ఉండాలన్నారు. ఓఎమ్మార్ పద్ధతిలో 50 మార్కులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9515764818ను సంప్రదించాలన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన



బోయకొండలో అధికారులకు సూచనలిస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: బోయకొండ ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆదివారం గంగమ్మను దర్శనం చేసుకున్న అనంతరం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలన్నారు. లేకుంటే స్వచ్ఛందంగా తప్పుకుంటే మరొకరికి అప్పగించి పనులు పూర్తి చేసుకుంటామని హెచ్చరించారు. వేసవిలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, నీడ, వసతుల కల్పన, వాయిదా పడిన వేలం పాటపై చర్చించారు. ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ నారాయణ, ఈఓ చంద్రమౌళి, పాలక మండలి సభ్యుడు వెంకటరమణారెడ్డి, నాయకులు సోమల మల్లికార్జునరెడ్డి, లడ్డూరమణ, నవీన్, గిరిబాబు, రఘు, మునికృష్ణమనాయుడు పాల్గొన్నారు.

### నేడు రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలో ప్రముఖ శైవక్షేత్రం అయిన మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజు, ఆలయ ధర్మకర్త విజయకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారికి అభిషేకాలు, పూజలు చేపట్టనున్నట్లు చెప్పారు. రాహుకాల సమయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

# కష్టాలు తీరాయి.. గొంతులు తడిశాయి

పలమనేరు: గత టీడీపీ పాలనలో మంచినీళ్లకు జనం పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. ఎండిన బోర్లతో గ్రామాల్లో మంచినీటికి ప్రజలు వ్యవసాయబోర్ల వద్దకెళ్లే సమస్యలు, నీటి ట్యాంకర్లతో సరఫరా చేసినా అందని మంచినీళ్లు, తాగునీటి కోసం గ్రామాల్లో మహిళల ఖాళీ బిందెలతో నిరసనలు గతంలో పలమనేరు నియోజకవర్గంలో చూశాం. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇలాంటి పరిస్థితులు మండల కేంద్రాల్లోకానీ గ్రామాల్లో కానీ కనిపించడం లేదు. మూడున్నరేళ్లుగా వరుణుడు కరుణించడంతో భూగర్భజలాలు పెరిగాయి. ఎండిన బోర్లలోనూ గంగ వచ్చింది. ఏ గ్రామంలోనూ మంచినీటి సమస్య లేకుండాపోయింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**గత టీడీపీ పాలన ఎలా ఉండేదంటే....**

వేసవికంటే ముందే మంచినీటికి కష్టాలు వచ్చేవి. పలు గ్రామాల్లో మంచినీటి కోసం ప్రజలు వ్యవసాయబోర్లను ఆశ్రయించేవాళ్లు. ఇక పల్లెల్లో రైతుల బోర్ల నుంచి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేవారు.

**మున్సిపాలిటీలో నీటి సరఫరా పరిస్థితి ఇలా...**

- పలమనేరు పట్టణ జనాభా : 65వేలు
- వార్డులు : 26
- పట్టణంలో 78 ప్రభుత్వ స్కీమ్ బోర్లు
- పట్టణానికి రోజువారి నీటి అవసరం 4.5 ఎంఎల్‌డీ
- టీడీపీ పాలనలో సరఫరా 3.8 మాత్రమే
- ఇప్పుడు అందుతున్న నీటి సరఫరా 5 ఎంఎల్‌డీ
- గతంలో ట్యాంకర్ల ద్వారా రోజుకి 50 ట్రిప్పులు





నాడు: కొత్తయిండ్లు సమీపంలో పొలాల వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు(ఫైల్), నేడు: టి.వడ్డూరు పంచాయతీలో ఇళ్ల వద్దే తాగునీటి ట్యాప్,

- వైఎస్సార్‌సీపీ పాలనలో పల్లెల్లో ఇంటింటికీ సురక్షితమైన నీరు
- ఇది నాటి టీడీపీకి నేటి వైఎస్సార్‌సీపీ పాలనకున్న తేడా

ఇప్పుడు నీటి ట్యాంకర్ల అవసరమే లేదు.

**నియోజకవర్గంలోని మండలాల్లో ఇలా...**

నియోజకవర్గంలో మొత్తం 90 పంచాయతీలున్నాయి. 478 గ్రామాల్లో నాలుగువేలకు పైగా స్కీమ్ బోర్లున్నాయి. అన్ని గ్రామాలకు రక్షిత మంచినీరు ఇళ్ల వద్దకే వెళుతోంది. గత టీడీపీ పాలనలో సగానికి పైగా గ్రామాల్లో మంచినీటికి ఇక్కట్లుండేవి. దీంతో పలు చోట్ల మహిళలు గ్రామ సమీపాల్లోని వ్యవసాయ బోర్ల వద్ద మంచినీటిని తెచ్చుకునేవారు. రోజూ ఏదో ఓచోట మంచినీటి సమస్యపై ధర్నాలు, ఖాళీ బిందెలతో నిరసలు జరుగుతుండేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితి నియోజకవర్గంలోని ఏ పల్లెలోనూ కనిపించదు. నాటి టీడీపీ పాలనలో పడిన నీటి కష్టాలను చూసిన మహిళలు ఇప్పుడు పుష్కలమైన మంచినీటితో ఆనందంగా ఉన్నారు.

**గతంలో మంచినీటి సరఫరాకు నెలకు కోటి....**

టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 దాకా మంచినీటి సరఫరా కోసం ట్యాంకర్లకు ప్రభుత్వం టీడీపీ నాయకులు, కార్యకర్తలకు చెల్లించిన బిల్లు నెలకు కోటి. ఆలెక్కన ఐదేళ్లలో రూ.60 కోట్లదాకా ప్రజాధనం ఖర్చు అయింది. కాని నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచినీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే పథకమే లేదు. ఎందుకంటే మంచినీటి సమస్య అసలు లేనేలేదు.

**గ్రామాల్లో ఇంటింటికి 55లీటర్ల నీరు..**

నిబంధన మేరకు ప్రతి మనిషికి రోజుకు 55 లీటర్ల నీటిని అందించాలి. ప్రస్తుతం 90శాతం గ్రామాల్లో రోజుకు మనిషికి 60 లీటర్లకు పైగా నీరందుతోంది. గ్రామాల్లోమంచినీటి సరఫరా విషయమై స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవిని వివరణ కోరగా నియోజకవర్గంలో ఎక్కడగాని మంచినీటి సమస్యలేదన్నారు.

**ఇంటింటికీ మంచినీళ్లు వస్తున్నాయి...**



గతంలో మంచినీటి కోసం మా పంచాయతీలో తరచూ గొడవలే. కాని నేటి ప్రభుత్వంలో ఇంటింటికి మంచినీటి ట్యాప్‌లను ఏర్పాటు చేశాం. ప్రజలు ఆనందంగా ఇంటి ముందే మంచినీటిని పట్టుకుంటున్నారు. మంచినీటి సమస్య లేదు. పుష్కలంగా స్కీమ్‌బోర్లలో నీళ్లు వస్తున్నాయి.

–మునస్వామి, సర్పంచ్, టి.వడ్డూరు

**సమస్యని వరుణుడే పరిష్కరించాడు..**



గత టీడీపీలో తాగేందుకు నీళ్లు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక వానదేవుడు మంచిగా కరుణించాడు. ఎన్నో ఏళ్లుగా నిండని చెరువులు, కుంటలు నిండాయి. దీంతో భూగర్భజలాలు పెరిగాయి. ప్రభుత్వ స్కీమ్ బోర్లలో పుష్కలంగా నీళ్లు వస్తున్నాయి.

–గోవిందస్వామి, సర్పంచ్, కొలమాసనపల్లి

## జగనన్నతో ముస్లింల సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక చర్యలు తీసుకున్నారని, అదే బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసే అనేక పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ అన్నారు. బైరెడ్డిపల్లె మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని హజరత్ బిస్మిల్లా షాఖాదరి 58వ ఉరుసు సందర్భంగా శనివారం రాత్రి ఖవ్వాలి పాట కచ్చేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో మైనార్టీలకు అరకొర మాత్రమే లబ్ధి చేకూరేదన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వంలో రూ. 20వేల కోట్లకు పైగా ప్రయోజనం కలిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మోహినీ రూపంలో కోదండరాముడు





మోహిని రూపంలో విహరిస్తున్న స్వామివారు, గరుడ వాహనంపై స్వామి వారు

శాంతిపురం: మోహిని రూపంలో ఉదయం విహరించిన కోదండరాముడు రాత్రి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు కటాక్షించాడు. రాళ్లబూదుగూరులోని కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారిని మోహిని అవతారంలో ఊరేగించారు. జ్యోతినగర వైశ్య సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపించారు. ముక్కోటి దేవతలను ఆహ్వానించి, వారి సమక్షంలో స్వామితో అమ్మవారి కల్యాణం మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా చేశారు. రాత్రి గరుడ వాహనంపై స్వామి వారు గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ సందర్భంగా మహా వాయిద్యాల ప్రదర్శన, బాణసంచా వేడుకలు నిర్వహించారు.

### వరదరాజుని ధ్వజారోహణం

పలమనేరు: మండలంలోని కూర్మాయి గ్రామంలో వెలసిన కూర్మవరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణం జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామకోటిని ఆలపించారు. కార్యక్రమాల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

### నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ

సదుం: మండలంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి ఆదివారం పరిశీలించారు. తిమ్మానాయనపల్లె, ఊటుపల్లె, ఉప్పరపల్లె, తాటిగుంటపాలెంలో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతో ఏఈ చంద్రశేఖర్, బాబు ఉన్నారు.

### చౌడేపల్లె టూ రుయా



రుయా ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ విశ్వశ్రీ

చౌడేపల్లె: తిరుపతి రూయా ఆస్పత్రి ఐసీయూ వార్డులో చికిత్స పొందుతున్న చౌడేపల్లె వైఎస్సార్ కాలనీకి చెందిన మాణిక్యంకు వలంటీర్ విశ్వశ్రీ ఆదివారం పింఛన్ అందజేసింది. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మాణిక్యం రుయాలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వలంటర్ విశ్వశ్రీ 100 కి.మీ ప్రయాణం చేసి చౌడేపల్లె నుంచి తిరుపతి వచ్చింది. పింఛన్ నగదును కుటుంబ సభ్యులకు ఇవ్వడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

### రథోత్సవం రేపు

కుప్పంరూరల్: మండలంలోని సామగుట్టపల్లి వద్ద వెలసిన కదిరిబండ నరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం హనుమంతవాహన సేవ, హరికథ, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని చెప్పారు. మంగళవారం రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు కౌన్సిలర్ మునిరాజు చెప్పారు. భక్తులు హాజరై స్వామి వారి కృపకుపాత్రులు కావాలని కోరారు.

## పుణ్యఫలం.. లక్ష్మీగణపతి హోమం..



పవిత్ర జలాలను ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో విశాఖ శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి ఆలయ అర్చక వేదపండితులతో కలిసి లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మొదటగా గోవుకు పూజలు చేశారు. అనంతరం వినాయక స్వామికి, గంగకు హారతులు ఇచ్చారు. అంతకు ముందు స్వామివారికి సుప్రభాత సేవలో ఉపయోగించే బిందుతీర్థంకు విశాఖ శారదా ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి పూజలు చేశారు.

**కాణిపాకంకు పోటెత్తిన భక్తులు**

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆలయంలో హోమాలు నిర్వహించడంతో పాటు ఆదివారం సెలవుదినం కావడంతో ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కరస్పాండెంట్

పెద్దపంజాణి: మండలంలోని మదర్ థెరిసా సీబీఎస్ఈ పాఠశాల ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి ఎడిఫై స్కూల్ కరస్పాండెంట్ ప్రణీత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి స్కూల్ పాఠ్యాంశాలను నేర్పింస్తుందిని, కానీ మదర్ థెరిసా పాఠ్యాంశాలతో పాటుగా శారీరక దారుఢ్యం పెంపుదల, మానసిక వికాసానికి ఎన్నో పాఠ్యాంశేతర కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు 2022–23వ సంవత్సరానికి గాను ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సంగీత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో చైర్మన్ సునీల్, డైరెక్టర్ శ్రేయ, డీన్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపల్ డేవిడ్ పాల్గొన్నారు.

## లోకేష్‌వి అర్థంపర్థం లేని వ్యాఖ్యలు



మాట్లాడుతున్న ఈశ్వరయ్య, అమాస మోహన్, నాగేశ్వరరావు

- పుంగనూరు అభివృద్ధికి ఏం చేశారో చెప్పండి
- ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలు

సోమల: నారా లోకేష్‌వి అర్థం పర్థం లేని వ్యాఖ్యలని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సంతగేటు వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కొనే దమ్ము ధైర్యం లేక యువగళం పాదయాత్రలో తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో పుంగనూరు నియోజకవర్గానికి రూ.100 కోట్లు ఇచ్చామని అబద్ధాలు చెప్పడం నారావారి ఫ్యామిలీకే సాధ్యమన్నారు. యువగళం పేరుతో కామెడీ యాత్ర చేస్తున్నారని ఎద్దేవ చేశారు. పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి మీ తండ్రి అడ్డుపడలేదని నిరూపించగలవా అని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. అనవసరంగా పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తే ప్రజలే దగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సచివాలయ మండల కన్వీనర్ రాశెట్టి మధు, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు వరదం కుమార్‌రాజా, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఐలా సూరి, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, నేతలు రమణయ్య, సాంబయ్య, రాజారెడ్డి, శ్రీరాములు, శ్రీనివాసులు, వీవీ రమణ, సరస్వతమ్మ, చక్రపాణి, సురేంద్ర పాల్గొన్నారు.

# శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించండి

–ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్వాటి శ్యాంప్రసాద్ రెడ్డి గెలుపునకు పట్టభద్రులు సహకరించాలని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులతో కలిసి భరత్ రామకుప్పంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టుభద్రుల ఇళ్లకు వెళ్లి శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్ర రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు ఉత్సాహం కనబరుస్తున్నారన్నారు. అందులోభాగంగా రాష్ట్రంలో 6 లక్షల ఉద్యోగ కల్పనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేశారన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలనకు పట్టభద్రులు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలా పురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ కోకన్వీనర్ చంద్రారెడ్డి, పార్టీ టౌన్ అధ్యక్షుడు అప్పి, వార్డు సభ్యులు జమీను ప్రసాద్, శంకర్, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సచివాలయ కన్వీనర్ జబీవుల్లా, సింగిల్ విండో డైరెక్టర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

**శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం**

చౌడేపల్లె: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ రామమూర్తి కోరారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి చౌడేపల్లె, గోసలకురప్పల్లె, నాయునివారిపాళ్యం, టీచర్స్ కాలనీ, హైస్కూల్ వీధి, బజారువీధిలో ప్రచారం నిర్వహించారు. సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రూపారేఖ, సర్పంచ్ వరుణ్‌భరత్, నాయకులు మిద్దెంటి కిషోర్‌బాబు, కల్యాణ్, అల్తాఫ్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ భరత్





సదుం: ప్రచారం చేస్తున్న ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటస్వామి, చౌడేపల్లెలో ఎంపీపీ రామమూర్తి

సోమల: మండలంలోని నెల్లిమంద, కందూరు, ఆవులపల్లె, కామిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. కందూరులో ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ బాషా మసూద్ ప్రచారం చేశారు.


సదుం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి కోరారు. మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలో ప్రచారం చేశారు. సర్పంచ్‌లు హనుమంతరెడ్డి, మురళీరెడ్డి పాల్గొన్నారు.

## కల్యాణం.. కమనీయం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సోమల: మండలంలోని ఆవులపల్లె గ్రామంలో వెలిసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి వారు పురవీధుల్లో విహరించారు. ఉభయదారులుగా పెద్దుప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లె పంచాయతీల బలిజ సంఘం సభ్యులు వ్యవహరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

**కల్యాణం.. కమనీయం..**

బైరెడ్డిపల్లె: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కడపనత్తం సమీపంలోని శ్రీనల్లగుండ్రాయస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. రంగు రంగుల పుష్పాలు, విద్యుత్‌దీపాలతో అలంకరించిన కల్యాణ వేదికపై అలిమేలు మంగమ్మ, పద్మావతి సమేత శ్రీనల్లగుండ్రాయస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య కల్యాణోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామక్రిష్ణమాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.